క్లుప్తంగా

యాత్రికుల భద్రతపై సమీక్ష



సమావేశంలో అధికారులు

రేణిగుంట: తిరుమల బ్రహ్మోత్సవాల సందర్భంగా యాత్రికుల భద్రత, రాకపోకల సౌకర్యాలపై రేణిగుంట రైల్వేస్టేషన్లో ఆదివారం అధికారులు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు అత్యధికంగా భక్తులు వచ్చిన సమయంలో అనుసరించాల్సిన అంశాలపై చర్చించారు. ట్యాక్సీ, ఆటోడ్రైవర్లు అధిక చార్జీలు వసూలు చేయకుండా కట్టడి చేయాలని యూనియన్ నేతలకు సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, అర్బన్, రూరల్ సీఐలు జయచంద్ర, మంజునాథరెడ్డి, ఆర్పీఎఫ్ సీఐ వెంకటేశ్వర్లు, స్టేషన్‌మాస్టర్ సీఎస్ రెడ్డి, ఆర్టీసీ కంట్రోలర్ గోవర్ధన్‌నాయుడు, జీఆర్పీ ఎస్ఐ మధుసూదన్‌రావు, యూనియన్ నేతలు పాల్గొన్నారు.

కనీస వసతులు కల్పించాలి



మండపంలో అవస్థలు పడుతున్న భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న కర్మక్రియల మండపంలో కనీస వసతులు కల్పించాలని హిందూ ధార్మిక సంఘాల సభ్యులు గరికపాటి రమేష్‌బాబు అన్నారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం మహాలయ అమావాస్య కావడంతో అనేక మంది తమ పూర్వీకులకు పిండ ప్రదానం చేశారన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారని అందుకు తగిన ఏర్పాట్లను ఆలయ అధికారులు చేయకపోవడం బాధాకరమన్నారు. అక్కడ సరైన వసతి లేకపోవడంతో పలువురు భక్తులు ఇబ్బందిపడ్డారని తెలిపారు. అధికారులు స్పందించి కర్మక్రియల మండపం వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి: స్థానిక పీవీ రోడ్డులోని అంకాలమ్మ ఆలయం వద్ద ఆదివారం మహాలయ అమావాస్యను పురస్కరించుకుని నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ గత మూడేళ్లుగా ప్రతి అమావాస్యకు భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. యశ్వంత్‌రావు, జయగణేష్, బాలాజీరావు, రాజశేఖర్, డాక్టర్ కృపానిధి, లోకేష్‌యాదవ్,అరుణ్, శివప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం



ఎస్ఐ విశ్వనాథనాయుడును సన్మానిస్తున్న డీఎస్పీలు

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్ఐ విశ్వనాథనాయుడు ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న సందర్భంగా ఆదివారం ఆయనకు సన్మానం చేశారు. శ్రీకాళహస్తిలోని కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ సన్మానానికి హాజరైన ఏపీ ట్రాన్స్‌కో అడిషనల్ ఎస్పీ జనార్ధన్‌నాయుడు, శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, తిరుపతి స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటనారాయణ ఆయన సేవలను కొనియాడారు. ఈ సన్మాన సభను బుచ్చినాయుడుకండ్రిగ సీఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఇందిరానగర్‌లో మండల వ్యవసాయ కార్యాలయం



ఇందిరానగర్ రైతు సేవా కేంద్రం

వరదయ్యపాళెం: ఇందిరానగర్ గ్రామ సచివాలయ ప్రాంగణంలో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రంలోకి మండల వ్యవసాయ కార్యాలయాన్ని మార్పు చేశారు. ఆ మేరకు ప్రస్తుతం ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయం సరిపోకపోవడంతో అక్కడికి మార్పు చేసినట్లు ఏఓ గౌరి తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి రైతు అవసరాల కోసం పాత వ్యవసాయ కార్యాలయ సమీపంలోని ఇందిరానగర్ రైతు సేవా కేంద్రం వద్ద సంప్రదించాలని ఆమె సూచించింది.

బాబు.. సింగపూర్ రోడ్లివే!

- దుస్థితిలో గ్రామీణ రోడ్లు
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



మన్నసముద్రం మార్గంలో రోడ్డు దుస్థితి

ఏర్పేడు: బాబొస్తే రోడ్లు బాగుపడతాయ్..సింగపూర్ రోడ్లను చేస్తాం.. ప్రయాణం స్వర్గధామమని ఊదరగొట్టిన తెలుగు తమ్ముళ్లు సైతం ప్రస్తుత రోడ్ల దుస్థితిని చూసి నోరెళ్లబెడుతున్నారు. మండలంలోని మన్నసముద్రం–బండారుపల్లి రోడ్డులో ఇసుక టిప్పర్లు ఓవర్‌లోడుతో వెళుతుండడంతో రోడ్డు ఒరిగిపోయి ఛిద్రమైంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలకు వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అలాగే మండలంలోని పాగాలి, మర్రిమంద, బండారుపల్లి, ముసలిపేడు, కందాడ వద్ద రోడ్లు గుంతలు, గుంతలుగా మారి అధ్వాన్న స్థితిలో ఉన్నాయి. ఇప్పటికైనా రోడ్లను బాగుచేయాలని కూటమి ప్రభుత్వాన్ని, అధికారులను స్థానికులు కోరుతున్నారు.



మన్నసముద్రం రోడ్డులో తేలిన మట్టి





గుంతలమయమైన ఎర్రగుడిపాడు రోడ్డు

బ్యాడ్మింటన్‌లో సత్తా చాటారు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్వీపీ ఆర్ట్స్ కళాశాలలో ఈ నెల 18న జరిగిన స్కూల్ గేమ్స్ మండల స్థాయి పోటీల్లో బ్యాడ్మింటన్ విభాగంలో దర్శ్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులు సత్తా చాటారాని నిర్వాహకులు సునీల్ తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా మండల వ్యాప్తంగా 24 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పాల్గొనగా అందులో దర్శ్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు ధీరజ్, షోయబ్, సాత్విక్, పూర్ణష్ విద్యార్థులు డివిజన్ స్థాయి పోటీలకు అర్హత సాధించారని వారు తెలిపారు. మండల స్థాయి బృందం నలుగురు కాగా వారు దర్శ్ బ్యాడ్మింటన్ అకాడమీ చెందిన వారే కావడం విశేషమని చెప్పారు. వీరిని ఆదివారం అకాడమీ నిర్వాహకులు సునీల్, కోచ్ పవన్‌కుమార్ అభినందించారు.

కాంట్రాక్ట్ కార్మికులను పట్టించుకునేదెవరు?

వరదయ్యపాళెం: శ్రీసిటీ, ఏపీఐఐసీ పరిధిలోని పలు పరిశ్రమల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పట్టించుకోవడంలో జిల్లా కార్మిక శాఖ అధికారులు నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నారని డివిజనల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గుత్తి త్యాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలాదిగా పనిచేస్తున్న కార్మికుల కష్టాన్ని కాంట్రాక్టర్లు దోచేస్తున్నారని ఆరోపించారు. చేసిన పనికి సరైన వేతనం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. దీనిపై జిల్లా కార్మిక శాఖ అధికారులు స్పందించి కార్మికుల ఇబ్బందులపై దృష్టి సారించాలని కోరారు.

నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు



కార్యనిర్వాహణ అధికారి లత

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో ఉన్న పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో నేటి నుంచి శరన్నవరాత్రులు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి లత పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ 22 నుంచి శ్రీ మరగదాంబిక అమ్మవారిని వివిధ రకాల అలంకరణల్లో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేసి, భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తామని ఆమె పేర్కొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందవలసినదిగా కోరారు.

రేపటి నుంచి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

నారాయణవనం: మండలంలోని సముదాయంలో టీటీడీ అనుబంధ అవనాక్షమ్మ ఆలయంలో మంగళవారం నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ సోమవారం ఉదయం అమ్మవారికి సర్కారు అభిషేకం, సాయంత్రం ఉత్సవాలకు అంకురార్పణం చేయనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 1వ తేదీ బుధవారం వరకు నిర్వహించే నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఉదయం అభిషేకం, సాయంత్రం అమ్మవారు రోజుకో అవతారంలో ఊంజల్ సేవలో భక్తులకు దర్శనం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మండలంలోని కైలాసనాథ కోనలో కామాక్షాంబిక సమేత కైలాసనాథ కోన, తిరువట్యంలో మూలస్థాన గంగమ్మ, నారాయణవనంలో ధర్మరాజుల ఆలయంలో, నగరి వీధి రామాలయంలో నవరాత్రి ఉత్సవాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ సాయంత్రం ఊంజల్‌సేవ, ప్రసాద వితరణ చేపడుతున్నారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు

నారాయణవనం: మండలంలోని ఆలయాల్లో ఆదివారం అమావాస్య పూజలను నిర్వహించారు. మహాలయ అమావాస్య కావడంతో పూర్వీకులకు కుటుంబసభ్యులు తర్పణాలు వదిలారు. సౌరకాయలస్వామి ఆలయంలో ఉదయం మూలవర్లకు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని అన్నప్రసాదాలను అందుకున్నారు. అలాగే వీరరాఘవస్వామి దేవస్థానంలో మధ్యాహ్నం జరిగిన అమావాస్య పూజల్లో మహిళలు, భక్తులు పాల్గొన్నారు. కైలాసనాథ కోనలోని శివశక్తి, శాంతి ఆశ్రమాలలో అమావాస్య పూజలను నిర్వహించారు.

విజయ దశమికి అమ్మవారి కొలువు



లలితాదేవి ఆలయంలో కొలువైన దుర్గాదేవి

సత్యవేడు: విజయదశమి సందర్భంగా స్థానిక వీరభద్రస్వామి ఆలయంలోని సర్వమంగళదేవి ఆలయంలో దుర్గాదేవిని కొలువు ఉంచారు. 15 రోజులు అమ్మవారికి విశేష పూజలు చేసి అమ్మవారి ఊరేగింపు, గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఆదివారం ఉదయం శ్రీ అనుగజ్ఞ గణపతి పూజ మృత్యుంజయ హోమం, కలశ ప్రతిష్ట, శ్రీ సర్వమంగళాదేవికి స్వర్ణ కవచధారణ చేపట్టారు. అమ్మవారిని నేటి నుంచి 22న శ్రీ బాల త్రిపుర సుందరిదేవిగా, 23న గాయత్రీదేవిగా, 24న అన్నపూర్ణ దేవిగా, 25న శ్రీ కాత్యాయని దేవిగా పసుపు కొమ్ముల అలంకరణ, 26న శ్రీ మహాలక్ష్మీదేవిగా, 27న శ్రీ లలితాదేవి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చే ఏర్పాటు చేస్తున్నట్లు ధర్మకర్త ఇందూరు రవి కుమార్‌దేవర్ తెలిపారు.

పూర్వీకులకు తర్పణాలు



స్వర్ణముఖిలో వదులుతున్న తర్పణాలు

శ్రీకాళహస్తి: మహాలయ అమావాస్య సందర్భంగా ఆదివారం రాఘవేంద్రస్వామి మఠం ప్రాంతంలో పూర్వీకులకు తర్పణాలు సమర్పించడానికి ప్రజలు పోటెత్తారు. ఆలయం, పురపాలక సంఘం తరపున గానీ ఎటువంటి ఏర్పాట్లు చేయకపోవడం చాలా ఇబ్బంది కలిగించింది. పాత మండపంలోనే ప్రజలు తర్పణాలు సమర్పించారు.

బాధిత కుటుంబాలను ఆదుకోండి



మృతుల కుటుంబాన్ని పరామర్శిస్తున్న అంజూరు, నేతలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని స్వర్ణముఖి నదిలో ఈతకు వెళ్లి మృతిచెందిన ఇద్దరు బాలుర కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయాలని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు కోరారు. శనివారం సాయంత్రం ఈతకు వెళ్లిన చిన్నారుల్లో హారూన్(8) మృతిచెందగా, గుణ(14) గల్లంతయ్యాడు. ఆదివారం ఉదయం ఘటనా స్థలానికి అంజూరు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు అక్కడికి వెళ్లి బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు. గజ ఈతగాళ్లను పిలిపించి నదిలో మరోసారి గాలింపు చేయించారు. గల్లంతైన గుణ మృతదేహాన్ని వెలికి తీశారు. గుణ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృత్యువాత పడిన బాలురకు ఆయన అంజలి ఘటించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు పరామర్శించి ధైర్యం చెప్పారు. అంజూరు మాట్లాడుతూ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చొరవ చూపి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. వేలూరు రమేష్, పఠాన్ ఫరీద్, సూరా సురేష్, కంటా ఉదయ్‌కుమార్, బుల్లెట్ జయశ్యామ్, సాధన మున్నారాయల్, జంలేషా, అస్లాం, సాధిక్, మునికుమార్ పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



ఆలయం వద్ద జస్టిస్ కేజే థాకర్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. గుజరాత్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి, హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్మన్ జస్టిస్ కేజే థాకర్, తమిళనాడు అడిషనల్ ఐజీ అన్బు, కర్ణాటక ఎమ్మెల్యే మల్లికార్జున మాదల్ స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారిలో ఉన్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

గంగమ్మ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



గంగమ్మదేవత



గంగపెట్టెను ఊరేగిస్తున్న భక్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరు గంగమ్మ దేవత జాతర బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. గ్రామస్తులంతా కలసి గంగమ్మ దేవత బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. అందులో భాగంగా అమ్మవారికి అభిషేకాలు చేసి, అలంకరించి, నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం అమ్మవారిని పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేసి, మైలు ముగ్గుతీర్పు, కలశ ఉత్సవం, శేషపాన్పు, కలశ గ్రామోత్సవం, పోతురాజు ముగ్గులను వేస్తారు. విద్యుత్ దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. మంగళవారం ఉదయం అంబలి, శ్రీ గంగమ్మదేవత ఉత్సవమూర్తుల ఊరేగింపు, ఎదురు పొంగళ్ల కార్యక్రమం జరుగుతాయని తెలిపారు.







గ్రామంలోని వీధుల్లో నిల్వ ఉన్న మురుగునీరు

పడకేసిన పారిశుద్ధ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర, స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని చేపట్టినా ప్రయోజనం లేదని చెప్పడానికి నిదర్శనమే వేణుగోపాలపురం. మండలంలోని వీఎస్‌పురం పంచాయతీ వేణుగోపాలపురంలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉంది. గ్రామంలోని అన్ని వీధుల్లో మురుగునీటి నిల్వలు దర్శమిస్తున్నాయి. మురుగునీటి కాలువలను శుభ్రం చేయకపోవడంతో కాలువలు మురుగునీటితో నిండిపోయాయి. మురుగునీటి నుంచి దుర్గంధం వెదజల్లుతుండడంతో గ్రామస్తులు ముక్కు మూసుకుని జీవనం సాగిస్తున్నారు. మురుగునీటి వల్ల దోమలు ఎక్కువైపోవడంతో స్థానికులు జ్వరాలతో ఆస్పత్రుల పాలవుతున్నామని చెబుతున్నారు. తాగునీటి కొళాయిలకు ట్యాప్‌లు లేకపోవడంతో నీరంతా వృథాగా పోతోంది. గ్రామంలోనే పేడ దిబ్బలు దర్శనమిస్తున్నాయి. పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సచివాలయాల్లో ఆగిన ఆధార్ సేవలు



నా పేరు కె.అనసూయమ్మ. మాది పెద్ద పాండూరు పంచాయతీ వెంగారెడ్డికండ్రిగ గ్రామం. నేను వితంతు పింఛనుదారు. అయితే పింఛన్ పొందేందుకు నా వేళ్ల బయోమెట్రిక్‌లో పడడం లేదు. కళ్లు కూడా ఐరిష్‌లో మ్యాచ్ కావడం లేదు. దీని కారణంగా రెండు నెలలుగా నాకు పింఛన్ ఇవ్వడం లేదు. పింఛన్ ఇచ్చే అధికారి ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలన్నారు. అయితే వరదయ్యపాళెం మండలంలో ఎక్కడా ఆధార్ కేంద్రం లేదు. దీంతో రెండు నెలలుగా అటు ఎంపీడీఓ కార్యాలయం, ఇటు ఆధార్ కేంద్రం నిర్వహించే సచివాలయం–1 చుట్టూ తిరుగుతూనే ఉన్నాను. కానీ పని మాత్రం కావడం లేదు. ఆధార్ కేంద్రం ఎప్పుడు ఓపెన్ అవుతుందో తెలియని పరిస్థితి. మరో 15 రోజుల్లో మూడో నెల పింఛన్ కూడా రానుంది. అయితే ఆధార్ అప్‌డేషన్ కానిదే వారు పింఛన్ ఇవ్వడం లేదు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.



ఆధార్ సేవలు ఆగిపోయిన వరదయ్యపాళెం సచివాలయం

- ఆధార్ సేవల కోసం అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

వరదయ్యపాళెం: గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ సేవలు పూర్తిగా ఆగిపోయాయి. గత రెండు నెలలకు పైగా ఈ ప్రక్రియ ప్రజలకు దూరమైనట్లు సమాచారం. దీంతో ఆధార్ మార్పులు, చేర్పులతోపాటు నూతనంగా ఆధార్ నమోదు కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీంతో సంక్షేమ పథకాల కోసం, ఇతర అవసరాల కోసం, విద్యార్థులు ఆధార్ అప్‌డేషన్ చేసుకోదలచిన వారు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఇబ్బందిపడుతున్నారు. కనీసం వారికి ఎప్పటి నుంచి సేవలు అందుబాటులోకి వస్తాయి అన్న సమాచారాన్ని చెప్పే వారు కూడా లేరు. ఇలా కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. దీంతో ఆధార్ నమోదు కోసం వచ్చే ప్రజల పరిస్థితి దయనీయంగా మారుతోంది.

బదిలీల సాకుతో...

ఇటీవల సచివాలయ ఉద్యోగులకు బదిలీలు నిర్వహించారు. అయితే బదిలీల ప్రక్రియ పూర్తయినప్పటికీ ఆధార్ సేవలు మాత్రం అందుబాటులోకి రాలేదు. ఆ మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా 7 మండలాల్లో 30కి పైగా సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు గతంలో కొనసాగాయి. ప్రస్తుతం ఒక్కచోట కూడా ఆధార్ కేంద్రం అందుబాటులో లేకపోవడం గమనార్హం. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి ఆధార్ కేంద్రాలను అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.



నాగలాపురం మండల కేంద్రంలోని సచివాలయంలో సిబ్బంది లేక ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న ఆధార్ కేంద్రం

మొరాయిస్తున్న 108 వాహనాలు



108ను నెడుతున్న సిబ్బంది

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి పరిధిలోని 108 వాహనాలు మొరాయిస్తున్నాయి. అత్యవసర సేవలకు ఉపయోగపడే ఈ వాహనాలు ఈ విధంగా ఎక్కడ పడితే అక్కడ ఆగిపోతుండడంతో రోగులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నవారు 108 వాహనంలో ప్రయాణించేటప్పుడు పొరపాటున ఏదైనా సమస్య వస్తే ఎలా అని ఆందోళన చెందుతున్నారు.ఉన్నతాధికారులు స్పందించి 108 వాహనాలకు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.